క్లుప్తంగా

మామిడిలో అంతర పంటగా నువ్వుల సాగు



కె.కె.అగ్రహారంలో అంతర పంటగా సాగులో నువ్వు పంట

కె.కోటపాడు: మండలంలో మామిడి పంటలను సాగుచేస్తున్న మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు అంతర పంటల విధానంలో పంటలను సాగు చేస్తున్నారు. ప్రధానంగా మొక్కదశలో ఉన్న మామిడి తోటల మధ్య గల ఖాళీల్లో ఈ అంతర పంటలు వేస్తున్నారు. కె.కె.అగ్రహారం, పాతవలస, మర్రివలస తదితర గ్రామాల్లో మామిడిలో తోటలో అంతర పంటగా నువ్వులు సాగు చేస్తున్నారు. దీని ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని సాగు రైతులు చెప్తున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న నువ్వు పంట కోత దశకు చేరుకుంది.

సన్యాసమ్మతల్లి ఒడ్డు పండగ నేడు



ప్రత్యేక అలంకరణలో గ్రామ దేవత సన్యాసమ్మ తల్లి

దేవరాపల్లి: స్థానికగ్రామ దేవత శ్రీ సన్యాసమ్మ తల్లి ఒడ్డు పండగను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్త వరదపు రెడ్డి లలితానాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని గ్రామస్తులు తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని, అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలుత జూన్ 4న అమ్మవారి ఒడ్డు పండగ జరగాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ అమలతో పాటు అదే రోజు ఓట్ల లెక్కింపు జరగనుండటంతో పోలీసుల సూచన మేరకు పండగను వాయిదా వేశారు. దీంతో తాజాగా మంగళవారం అమ్మవారి పండగను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

టీవీ రమణను పరామర్శించిన ధర్మశ్రీ



వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు టీవీ రమణని పరామర్శిస్తున్న కరణం ధర్మశ్రీ

రోలుగుంట: మండలంలోని జానకిరాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ టీవీ రమణని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సోమవారం పరామర్శించారు. రమణ గుండె సంబంధిత వ్యాధికి చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన ధర్మశ్రీ అతని ఇంటికి వెళ్లి, ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఏ సాయం కావాలన్నా తనకు ఫోన్ చేయాల్సిందిగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రమణను పరామర్శించిన వారిలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు మడ్డు అప్పలనాయుడు, లగుడు కృష్ణంనాయుడు ఉన్నారు.

'అందరి సహకారంతో హిందూ ధర్మ పరిరక్షణ'

మాడుగుల రూరల్: హిందూ మత వ్యాప్తికి ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీమన్నారాయణాచార్యులు తెలిపారు. సోమవారం కె.జె.పురం జంక్షన్లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అన్యమత వ్యాప్తిని అరికట్టడానికి కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. అయోధ్య రామ మందిర నిర్మాణంతో హిందూతత్త్వం ఎంతగానో వ్యాప్తి చెందిందన్నారు. జిల్లా అధ్యక్షులు బంకుపల్లి సత్యనారాయణ, జిల్లా ప్రచారక్ తవ్వా సన్యాసిశెట్టి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ రాపేట రామకొండరావు, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, మండల ప్రచారక్ పిల్లా రాముతో పాటు సమీప గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సరుగుడు వైపు.. రైతుల చూపు

- సాధారణ పంటల సాగుకు పెరిగిన వ్యయం
- సరుగుడులో క్లోన్స్, జుంజూర్ రకాలకు ప్రాధాన్యత
- నాలుగేళ్లలోనే కోతకు సరుగుడు.. లాభాల్లో రైతులు

వర్షాధారంగా, నీటి వనరులు తక్కువగా ఉన్న మెట్ట భూముల్లో సరుగుడు సాగు రైతులకు అన్నివిధాలా మేలు. ప్రతికూల పరిస్థితుల్ని తట్టుకుని, తక్కువ పెట్టుబడితో.. అధిక లాభాలనిచ్చేది సరుగుడు. బలమైన గాలుల్ని కూడా తట్టుకుంటుంది. అందుకే కె.కోటపాడు మండల రైతులు సరుగుడు సాగువైపు దృష్టిసారించారు. ఈ ఏడాది దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో సాగుకు సిద్ధమయ్యారు.



నాట్లు వేసేందుకు ఆటోలో తరలిస్తున్న సరుగుడు మొక్కలు



కె.సంతపాలెం నర్సరీలో క్లోన్స్ రకం సరుగుడు మొక్కలు

కె.కోటపాడు: ప్రస్తుతం వర్షాలు అడపాదడపా కురుస్తుండడంతో వరి, చెరకు పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు సరుగుడు సాగుకు ఆసక్తిని చూపుతున్నారు. సరుగుడుకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. టన్ను సరుగుడుకు రూ.10 వేల వరకూ మద్దతు ధర దక్కుతోంది. వరి, చెరకు పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగిపోవడం, మద్దతు ధర ఆశించినంత లేకపోవడంతో సరుగుడు సాగు వైపు రైతులు మళ్లుతున్నారు.

వెయ్యి ఎకరాల్లో సరుగుడు నాట్లు

ఈ ఏడాది కె.కోటపాడు మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో ఖరీఫ్ సాగు కాలం ప్రారంభానికి ముందే వెయ్యి ఎకరాల్లో సరుగుడు సాగుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. సరుగుడు సాగుకు వాతావరణ పరిస్థితులు ప్రస్తుతం అనుకూలంగా ఉన్నాయి. దీంతో సరుగుడు నారు సేకరణ పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు. చౌడువాడ, గొండుపాలెం, గుల్లేపల్లి, అర్లి, చంద్రయ్యపేట, చింతపాలెం, పిండ్రంగి, శృంగవరం, కొత్తభూమి, గొట్లాం గ్రామాల్లో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో సరుగుడు మొక్కలు వేశారు. ఎకరా పొలంలో సరుగుడు నాట్లు, దుక్కులు, ఎరువులు ఇతర కూలీ ఖర్చులతో సుమారు రూ.30 వేలు పెట్టుబడి వ్యయం అవుతుంది. నాలుగేళ్లలో రూ.8 నుంచి 10 లక్షల వరకు లాభార్జన చేయవచ్చని రైతులు చెప్తున్నారు.

ఎకరానికి 80 టన్నుల దిగుబడి

సరుగుడు సాగులో క్లోన్స్ సీహెచ్-5, మర్కాన్ రకంతో పాటు జుంజూర్ రకం సరుగుడు నారు అందుబాటులో ఉంది. నాటు సరుగుడు రకం మొక్కలు కోత దశకు ఎదగాలంటే సుమారు ఐదేళ్లు పడుతుంది. ఈ రకం మొక్కలతో ఎకరానికి 50 టన్నుల దిగుబడి మాత్రమే వస్తుంది. క్లోన్స్, జుంజూర్ రకం సరుగుడు వల్ల ఎకరా విస్తీర్ణంలో 80 టన్నులకు పైగా దిగుబడి సాధ్యం. మరోవైపు నాలుగేళ్లలోనే కోత దశకు వస్తుంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదైనా ఈ రకం సరుగుడు తట్టుకుని ఏపుగా ఎదుగుతుంది. దీంతో లాభదాయకంగా మారిన సరుగుడు సాగు వైపు రైతులు మొగ్గ చూపుతున్నారు.

అందుబాటులో నారు



ప్రస్తుతం క్లోన్స్, జుంజూర్ రకం సరుగుడు నారు అందుబాటులో ఉంది. నర్సరీలోనే అంటుకట్టే విధానంలో క్లోనింగ్ నిర్వహించి క్లోన్స్ మొక్కలను సిద్ధం చేస్తున్నాం. రైతుల డిమాండ్ దృష్ట్యా పాండిచ్చేరి నుంచి నారును తెస్తున్నాం. తక్కువ ధరకే రైతులకు అందిస్తున్నాం. నర్సీపట్నం, చోడవరం, సబ్బవరం, దేవరాపల్లి, చోడవరం, కొత్తవలస, ఎస్.కోట ప్రాంతాల నుంచి రైతులు వచ్చి నారు తీసుకెళ్తున్నారు. క్లోన్స్ రకం సరుగుడు ఎకరాకు సుమారు 80-100 టన్నుల దిగుబడి వస్తుంది. రైతులకు సాగు లాభసాటిగా ఉంటుంది. ఇతర వివరాలకు 90007 40224కు సంప్రదిస్తే సాగు సలహాలు, సూచనలు అందించగలను.

– కొల్లి వెంకటరమణ, అఖిల నర్సరీ, కె.సంతపాలెం

గిరిజన గ్రామాల్లో చురుగ్గా ఉపాధి పనులు



పోడు భూముల్లో ట్రెంచ్, రాతి పేర్పు పనుల్లో ఉపాధి కూలీలు

నాతవరం: గిరిజన గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా వ్యవసాయ భూముల్లో ట్రెంచ్‌లు, రాతిపేర్పు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మండలంలోని సరుగుడు, సుందరకోట పంచాయతీల శివారు 16 గిరిజన గ్రామాల్లో జీడిమామిడి తోటలున్న పోడు భూముల్లో పనులు చేపట్టాలని చాలా కాలంగా గిరిజనులు అధికారులను కోరుతున్నారు. వారి కోరిక మేరకు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి ప్రత్యేక దృష్టి సారించి ఉపాధి హామీ పథకం అధికారులతో మాట్లాడి రాతిపేర్పు, ట్రెంచ్ పనులు చేపట్టారు. ఇటీవల వర్షాలు కురియడంతో చెరువులో నీరు చేరి ఉపాధి హామీ పనులకు ఆటంకంగా మారింది. దీంతో కూలీలకు 100 రోజుల పాటు పని కల్పించే కార్యక్రమంలో భాగంగా పోడు భూముల్లో పనులు చేపట్టారు. సరుగుడు, సుందరకోట గ్రామాల్లో నిబంధనల మేరకు పనులు చేస్తున్నారు. జిల్లాలోనే అధికంగా కూలీలకు పని కల్పించాలన్న ఉన్నతాధికారులు ఆదేశాలతో ఎంపీడీవో జాగరపు రాంబాబు, ఏపీవో చిన్నారావు ప్రత్యేక దృష్టి సారించారు. రెండు వారాల క్రితం మండలంలో రోజుకు 12 వేలకు పైగా కూలీలకు పని కల్పించేవారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో నీరు చేరడంతో ఉపాధి పనులు నెమ్మదించినట్లు అధికారులు చెప్తున్నారు.

మండలంలో మట్టి నమూనాల సేకరణ

- 1300 నమూనాల సేకరణ లక్ష్యం
- మండల వ్యవసాయాధికారి శైలజ



రైతు భూమిలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

నాతవరం: రైతుల భూముల్లో భూసార పరీక్షల్లో భాగంగా మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి శైలజ తెలిపారు. 1300 మట్టి శాంపిల్స్ సేకరించాలని ఉన్నతాధికారులు నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేకరించిన నమూనాలను అనకాపల్లి జిల్లా భూసార పరీక్షా కేంద్రానికి తరలిస్తామన్నారు. భూసార పరీక్షల అనంతరం భూమిలో ఉన్న లోపాలను గుర్తించి కార్డులలో నమోదు చేసి రైతులకు అందిస్తామన్నారు. ఆ భూమిలో ఉన్న లోపం మేరకు ఏం వాడాల్లో తెలియజేస్తామన్నారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో లోపాలను తెలుసుకోకుండా ఇష్టారీతిన రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల నేల నిస్సారమవుతోందన్నారు. అందుకే రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా మట్టి నమూనా పరీక్షలు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా తమ సిబ్బంది మట్టి నమూనాల సేకరణలో ఉన్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన వరి విత్తనాలను ఆర్బీకేల ద్వారా ఈ నెల 19 నుంచి రైతులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్

బక్రీద్.. ముస్లింలు ఘనంగా ఆచరించే పండగ. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా, దేవుడిపై విశ్వాసంతో, సన్మార్గంలో జీవనాన్ని సాగించాలనే గొప్ప సందేశాన్ని మానవాళికి అందించింది బక్రీద్. తమకు ఉన్నదాంట్లోనే ఇతరులకు పంచి పెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటిలేదనే స్ఫూర్తిని పెంచింది. అందుకే ముస్లిం సోదరులున్న ప్రతి ప్రాంతంలో బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.

- పలు గ్రామాల్లో ఘనంగా బక్రీద్ వేడుకలు
- పరస్పర శుభాకాంక్షలు చెప్పుకున్న ముస్లింలు



రోలుగుంట మసీదులో ఆత్మీయ ఆలింగనం చేసుకుంటున్న ముస్లిం చిన్నారులు



మాకవరపాలెంలో నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ పండగను ఉత్సాహంగా చేసుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి, కుటుంబ సమేతంగా స్థానిక మసీదులకు వెళ్లి, ప్రార్థనలు చేశారు. అనంతరం బంధువులు, స్నేహితులకు శుభాకాంక్షలు తెలిపారు. రోలుగుంట మసీదులో స్థానికులతో పాటు కొవ్వూరు గ్రామస్తులు, నిండుగొండ మసీదులో స్థానికులతో పాటు కె.నాయుడుపాలెం ముస్లింలు, బుచ్చింపేట తదితర గ్రామాల్లోని ముస్లింలు నర్సీపట్నం మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. రోలుగుంట మసీదులో ప్రార్థనానంతరం తమలో పేద కుటుంబాలకు ఆర్థికంగా సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ అంటే మాంసం తినే పండగ కాదని, మనలోని చెడును తొలగించి మంచిని పెంచేదన్నారు.

మాకవరపాలెం: బక్రీద్ పండగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరిపారు. మండల కేంద్రంలోని మసీదుకు వివిధ గ్రామాల నుంచి ముస్లింలు ఉదయాన్నే చేరుకుని నమాజ్ చేశారు. త్యాగానికి ప్రతీకగా జరిగే బక్రీద్ విశిష్టతను మత పెద్దలు తెలిపారు. అనంతరం పేదలకు ముస్లిం సోదరులు తోచిన సాయం అందించారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: వామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా సోమవారం రాత్రి ఆలయంలో పార్వతీపరమేశ్వరులకు పండితులు ఘనంగా కల్యాణం జరిపారు. ముందుగా ఆలయంలో ఉన్న స్వయంభూ లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అందరి సంక్షేమమే ప్రభుత్వ విధానం

అనకాపల్లి ఎంపీ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రమేష్, చిత్రంలో ఎమ్మెల్యే రాజు

చోడవరం: ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సి.ఎం.రమేష్ అన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత మొదటి సారిగా చోడవరం పట్టణంలో నియోజకవర్గ స్థాయి కూటమి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కూటమి శ్రేణులు ఎంపీకి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎన్నికల్లో తమ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామ్మూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ పాల్గొన్నారు.

కమనీయం కల్యాణ వేంకటేశుని కల్యాణం

- భారీగా తరలి వచ్చిన భక్తజనం
- ఆలయం వద్ద అన్న సమారాధన



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశుడు



కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు



కేజే పురం జంక్షన్లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశుని 14వ వార్షిక కల్యాణోత్సవం కేజే పురం జంక్షన్లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవరం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణోత్సవంలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు అరవిల్లి సుదర్శనాచార్యుల వారి బృందం సారథ్యంలో ఉదయం స్వామి వారి ఎదురు సన్నాహం జరిగింది. అనంతరం కల్యాణ వేడుకను వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు స్థానికులతోపాటు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. జంక్షన్‌లోని వేంకటేశ్వర స్వామి వారి సేవకుల ఆర్థిక సహకారంతో స్వామి వారి సారెను ఊరేగింపుగా తెచ్చి, స్వామి వారికి నివేదించారు. కల్యాణం అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయం వద్ద భక్తి సంగీత కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గతేడాది జులై నుంచి ఈ ఏడాది జూన్ వరకు స్వామివారి నిత్య ధూప దీప నైవేద్యాలకు ఆర్థిక సాయం అందించిన దాతల్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాంచి, స్వామి వారి చిత్రపటాలను బహూకరించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావును ఆలయ కమిటీ ప్రత్యేకంగా సత్కరించింది. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రచారక్ తవ్వా సన్యాసిశెట్టి, జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ, శ్రీమన్నారాయణస్వామి, ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ రాపేట రామకొండారావు మాస్టర్, ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, కోశాధికారి పుట్టా బలరామమూర్తి, కమిటీ సభ్యులు యల్లపు రాము, కాళ్ల నర్సింగరాజు, రాపేట బాబూరావు, నాచు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న స్వామి వారి తిరువీధి ఉత్సవం, 22న నాగవల్లి సంబరాలతో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఎన్నెన్నో వర్ణాలు.. అన్నింట్లో అందాలు

అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రోడ్ల పక్కన మొక్కలు రంగు రంగుల పుష్పాలతో కనువిందు చేస్తున్నాయి. కొన్ని రకాల పువ్వులకు పేర్లు తెలియకపోయినా వాటి అందం కళ్లను కట్టిపడేస్తోంది. చోడవరం పట్టణం, శివార్లలో కొన్ని మొక్కలకు పూసిన పువ్వులు చూపరుల్ని ఆకట్టుకుంటున్నాయి. రాఖీ మాదిరిగా రంగురంగులతో ఓ పుష్పం అందాలు చిందిస్తుంటే.. మరో మొక్క ఆకులే పువ్వులుగా కనిపించి అందరి దృష్టిని తన వేపు తిప్పుకుంటోంది. ఆకు మధ్యలో పువ్వు లేకపోయినా, ఎర్రటి పువ్వు మాదిరిగా సగం ఆకులు రంగును పూసుకోవడంతో ఆకు మధ్యలో పువ్వు విచ్చుకున్నట్లే కనిపిస్తోంది. క్రోటాన్ జాతికి చెందిన గోవా ఫ్లవర్ చూసేవారిని కట్టి పడేస్తోంది. తొలకరి సీజన్లో వర్షాలు కురవడంతో సాధారణ రకాలతో పాటు సువాసన లేని ఇలాంటి పువ్వులు పూస్తాయని స్థానికులు చెప్తున్నారు. వీటిని చూసేందుకు అటుగా వెళ్లే జనం ఆసక్తి చూపుతున్నారు. – చోడవరం



పువ్వు కాదు ఇవి ఆకులే




అందమైన రాఖీ పుష్పం



కనువిందు చేస్తున్న గోవా ఫ్లవర్స్

వైభవంగా కల్యాణ వేంకటేశుని ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి వార్లు

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లి సమీపంలో పాండవుల మెట్టపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తజనం స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించి పులకించారు. మారేపల్లితో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి, స్వామి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు గోవింద నామ స్మరణతో మారుమోగాయి. భజనలు, కోలాట ప్రదర్శనలతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

శివాలయంలో ఆర్డీవో దంపతులు



శివాలయం వద్ద పూజల అనంతరం ఆర్డీవో దంపతులు

గొలుగొండ: ప్రముఖ శైవ క్షేత్రమైన ధారమఠం శివాలయాన్ని నర్సీపట్నం ఆర్డీవో జయరాం దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ పూజారి నాగభూషణం ఆర్డీవో దంపతులచే ప్రత్యేక పూజలు జరిపించారు. నర్సీపట్నం డివిజన్‌లో విశిష్టత కలిగిన ఆధ్యాత్మిక నెలవైన శివాలయ సందర్శన ఆనందంగా ఉందని ఆర్డీవో అన్నారు. దట్టమైన అడవులు, జలజల పారే జలపాతాల నడుము ఆలయం వద్ద ఎంతో ప్రశాంతంగా ఉందన్నారు.